మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# వర్ష బీభత్సం



లత్తీపూర్ శివారులో డిండి అలుగు పారుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

- జల దిగ్బంధంలో ఉప్పునుంతల
- ప్రకృతి విపత్తుతో తల్లడిల్లిన రైతాంగం
- మండలంలో భారీగా పంట నష్టం
- ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు
- నీట మునిగిన పంటలు..
- నిలిచిపోయిన రాకపోకలు ...
- వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- దిండి అలుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

**ఉప్పునుంతల, అక్టోబరు 29 ప్రభాతవార్త :** గత రెండు రోజులపాటు మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రకృతి విపత్తుతో మండలంలో పంట పొలాలు దెబ్బతిని రైతాంగం తల్లడిల్లి పోయారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సిన మండల స్థాయి అధికారులు అందుబాటు లేకుండా వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు సమాచారం అందించారు. మండలంలో అత్యధికంగా 19 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో మండలంలోని 14 గ్రామాలకు వెళ్లే రహదారిలో కల్వర్టుల వద్ద ప్రవహిస్తున్న వరద ఉధృతి తో ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రాకపోకలు నిలిపివేశారు. మండలంలోని మొల్గర వద్ద దుందుభి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గ్రామస్తుల సమాచారం మేరకు కల్వర్టుల వద్ద ముళ్ల కంచెను ఏర్పాటుచేయగా, కొన్ని గ్రామాలలో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పహారా నిర్వహించారు. మండలంలోని పూర్యనాయక్ తాండ వద్ద ప్రవహిస్తున్న చంద్రసాగర్ దిగువ ప్రాంతంలో మూగజీవాలు వరదలో ఇరుక్కుపోయాయి. చింతపల్లి నుంచి హాజీపూర్ వెళ్లే మార్గంలో కంసానిపల్లి చీకటి వాగు ఉధృతి అధికంగా ఉండడంతో ఆ ప్రాంతం గుండా రాకపోకలు నిలిపివేశారు. పోలీసులు రాకపోకలు నిలిపి వేసిన ప్రాంతం గుండా ప్రజలు ప్రయాణాలు నిలిపి వేసుకోవాలని సూచించారు. ఉప్పునుంతల నుంచి అచ్చంపేటకు వెళ్లే మార్గంలో మల్లప్ప వాగు, ఉప్పునుంతల నుంచి కంసానిపల్లి మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండా రెడ్డిపల్లికి వెళ్ళే మార్గంలో గట్టుకాడి పల్లి వద్ద కల్వర్టులో ఉధృతంగా వర్షపు నీరు వెళ్లడం, ఉప్పునుంతల నుంచి సదగోడు వెళ్లే మార్గంలో ఉన్నా కల్వర్టులో భారీ ఎత్తున వరద ప్రభావం వెళ్లడంతో, ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి, ఉప్పరిపల్లి మీదుగా వెళ్లే మార్గం గుండా ఉన్న కల్వర్టుల వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో పూర్తిగా ఉప్పునుంతలకు ఇతర ప్రాంతాలకు సత్సంబంధాలు లేకుండా పోయాయి.



లత్తీపూర్ శివారులో డిండి అలుగు ప్రాంతాన్ని ట్రాక్టర్‌పై వెళ్ళి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీ

## భద్రతా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాలు

### హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాకపోకలు నిలిపివేత

మండలంలోని లత్తిపూర్ గ్రామ శివారు ప్రాంతంలో డిండి ప్రాజెక్టుకు కుడివైపున ప్రవహించే డిండి అలుగు అత్యంత భయంకరంగా ప్రవహిస్తోంది. వరద నీరు శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జిని తాకుతూ ప్రవహించడంతో స్థానిక ప్రజల్లో భయం నెలకొంది. బ్రిడ్జి కింద రాతి గర్భంలో అలుగు నీరు బలంగా ఢీకొడుతూ ఉండటంతో బ్రిడ్జి పునాదులు దెబ్బతింటాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో స్థానికులు వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. సమాచారం అందుకున్న టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిండి అలుగు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ప్రజల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. ఈ రహదారిపై ఎవరూ ప్రయాణించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానికులు మాజీ సర్పంచ్ మల్లేష్ మాట్లాడుతూ ఇంతటి ఉధృత ప్రవాహం ఎప్పుడూ చూడలేదని. బ్రిడ్జి అడుగున రాళ్లకు నీటి ప్రవాహం అధికంగా ఉందని, ప్రభుత్వం వెంటనే శాశ్వత చర్యలు తీసుకోవాలి ఆయన కోరారు. ప్రస్తుతం డిండి అలుగు పరిసర ప్రాంతాల్లో హెచ్చరికలు జారీచేయగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అచ్చంపేట డిఎస్పీ పల్లె శ్రీనివాసులు కోరారు.

## దిండి అలుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

మండలంలోని లత్తి పూర్ గ్రామపంచాయతీ శివారులో ప్రవహిస్తున్న దుందుభి వాగు అలుగు ప్రాంతాన్ని నాగర్ కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం రాత్రి పరిశీలించారు. శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు నిలిపివేసి ప్రమాదం అంచున ఉన్న డిండి అలుగు ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులకు పలు సూచనలు సలహాలు అందించారు ఇచ్చారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తోపాటు డిఎస్‌పి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సై వెంకట్ రెడ్డిలు ఉన్నారు.



ఆవుసలికుంట గ్రామాల వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు గౌడ్, సిబ్బంది

## ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు

**లింగాల, అక్టోబరు 29 ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. చెన్నంపల్లి, పద్మనపల్లి, జీల్గుపల్లి, ఆవుసలికుంట, అంబట్‌పల్లి, అప్పాయిపల్లి వాగులు వంకలు ఉధృతంగా పొంగి పొర్లడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అంబట్‌పల్లి, ఆవుసలికుంట గ్రామాల మధ్య ఉన్నవాగులో కారు తోపాటు డ్రైవర్ కొట్టుకుపోవడంతో ప్రజల సహకారంతో బయటకు లాగారు. చిన్నవాగు సమీపంలోని రోడ్డుపై జర్పుల వెంకటయ్య ఆరబోసిన 100 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం పూర్తిగా కొట్టుకుపోయింది. మేతకోసం వెళ్ళిన జెర్సీ బర్రె రూ.1.50వేలు విలువ చేసే చీకటి చెరువు వాగులో కొట్టుకుపోయింది.

# జాతరకు.. వర్షం ఎఫెక్ట్

### ముసురు వర్షాలతో వ్యాపారస్తులు డీలా..

### వర్షాలతో భక్తుల అవస్థలు..

### పారిశుద్ధ్యంపై అధికారుల పర్యవేక్షణ

**చిన్నచింతకుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** శ్రీ కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు ముసురు వర్షాల ఎఫెక్ట్ తగిలింది. తుఫాను కారణంగా ముసురు వర్షాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులపాటు జాతరలో ఉండాలనుకున్నా భక్తులు ఈ వర్షాల కారణంగా జాతరనుంచి తరలిపోవడంతో వ్యాపారాలు కొనసాగాక వ్యాపారస్తులు డీలాపడ్డారు. మంగళవారం రాత్రి ముసురువర్షంతో భక్తులు తమవాహనాల కింద, ప్లాస్టిక్ కవర్ల చాటున ఉంటూ సేద తీరారు. బుధవారం ఉదయం భక్తులు తమ వాహనాలపై జాతర నుంచి సొంత గ్రామాలకు తరలి వెళ్లారు. ముసురు వర్షాలు లేకపోతే రెండు రోజులపాటు బంధువులతో కలిసి సంతోషంగా గడుపుదాం అనుకున్నా వర్షాల కారణంగా ఉండలేకపోతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు లేక వ్యాపారస్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ వర్షాల వల్ల జాతరలో పారిశుద్ధ్య లోపం లేకుండా అధికారులు బుధవారం జాతరలో వివిధ వ్యాపారాలు ముందు చెత్త లేకుండా అవగాహన కల్పించారు. జాతరలో పర్యటించి చెత్తచెదారం లేకుండా చూడాలని కిందిస్థాయి ఉద్యోగులను ఆదేశించారు. స్వామివారి కోనేరులో పర్యటించి నీటిని పరిశుభ్రంగా ఉంచాలని దేవస్థానఅధికారులకు సూచించారు. మాంసం దారులు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని, రోగాలు వచ్చిన పొట్టేలు మాంసం విక్రయించరాదని అలా విక్రయిస్తే చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ అధికారులు హెచ్చరించారు. మాంసం దారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మాంసం దుకాణాల వద్ద చెత్త లేకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వర్షం కారణంగా జాతర వెళ్లాలంటే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం తక్కువైతేనే మరలా జాతరలో భక్తుల రద్దీ, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



జాతర కోనేరులో పడవపై తిరుగుతున్న తహసీల్దార్



జాతరలో పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు ఇస్తున్న తహసిల్దార్

# తుఫాన్ ప్రభావం నీట మునిగిన వరి పంట

### వందలాది ఎకరాల్లో నష్టం.. కంటతడి పెడుతున్న అన్నదాత

**బిజినేపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త:** అన్నం పెట్టే రైతన్న మొంథా తుఫాన్ దెబ్బకు కన్నీరు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికే భారీ వర్షాల నేపథ్యంలో పంట దిగుబడి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ చేతికి అందిన, కొద్ది మాత్రం వరి పంట సైతం తుఫాను ప్రభావంతో నీట మునిగింది. వేలాది ఎకరాల వరి పంట ముంపునీటిలో ఉండిపోయింది. తుఫాను ఈదురు గాలుల నేపథ్యంలో నేలకొరిగాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ముంపు - మిగతా4లో..



తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంట

# మత్స్యశాఖను భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్ ప్రభుత్వం

- మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధే
- కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం నియోజకవర్గ అభివృద్ధే
- పరమావధిగా పనిచేస్తున్న నాయకుడు జిఎంఆర్
- పశుసంవర్ధక, మత్స్య, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- దేవరకద్ర మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



నిధులతో సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు శంకుస్థాపన చేసిన మంత్రి, ఎమ్మెల్యే

**దేవరకద్ర, అక్టోబరు 29 ప్రభాతవార్త:** మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పశుసంవర్ధక, మత్స్య, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర నియోజకవర్గంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టులో మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మత్స్య శాఖను భ్రష్టు పట్టించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకారులు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పూర్తి రాయితీతో రాష్ట్రంలోని 26వేల చెరువులలో 88 కోట్ల చేప పిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధే పరమావధిగా పనిచేస్తున్న నాయకుడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అని ప్రశంసించారు. మక్తల్, దేవరకద్ర నియోజకవర్గాలను సమదృష్టితో చూస్తానని తెలిపారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మత్స్యశాఖను భ్రష్టు పట్టించిందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాగానే మంత్రిగా బాధ్యతలు తీసుకున్న - మిగతా3లో..

# క్రమశిక్షణతో మెలగాలి

- కలెక్టర్ విజయేంద్ర బోయి
- గిరిజన బాలుర వసతిగృహం తనిఖీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టు గడ్డ లో ఉన్న గిరిజన కళాశాల బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో వంట గది, స్టోర్ రూమ్, పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి భవిష్యత్ ప్రణాళికలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాగా కష్టపడి లక్ష్య సాధన దిశగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్, వసతి గృహ సంక్షేమ అధికారులు ఉన్నారు.



వంటగదిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# అన్నదాతలు ఆందోళన పడవద్దు

### చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 29 ప్రభాతవార్త :** అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి దాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పెద్దమందడి మండలం వెల్టూరు, చిట్యాల సమీపంలోని వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి జిల్లా పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా మొత్తంలో మొదటి విడతగా 396 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇందులో మహిళా సంఘాల ద్వారా 170 కేంద్రాలు, పిఏసిఎస్ ద్వారా 218 కేంద్రాలు, మెప్మా ద్వారా 8 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా - మిగతా4లో..

## విత్తన పత్తి రైతులకు ఇబ్బందుల్లేకుండా

# కంపెనీలు సహకరించాలి

**గద్వాల టౌన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** విత్తన పత్తి పంటకు ధరలు, చెల్లింపు విషయంలో కంపెనీలు ఒప్పందం చేసుకున్న ప్రకారం వ్యవహరించి, రైతులకు ఇబ్బందులు లేకుండా సహకరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లాలో విత్తన పత్తి సాగు చేస్తున్న రైతులకు ఆయా కంపెనీల పెండింగ్ చెల్లింపులు, ఒప్పందం విషయంలో ఉన్న సమస్యలపై కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో సుమారు 46 వేల ఎకరాల్లో 36,430 మంది రైతులు విత్తన పత్తి సాగు చేసినట్లు చెప్పారు. వీరికి దాదాపు రూ.261 కోట్ల బకాయిలు ఉన్నందున సాధ్యమైనంత తొందరగా చెల్లించేలా కంపెనీల ప్రతినిధులు తమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలి అన్నారు. విత్తనపత్తి సాగు విషయంలో 2025.26 సంవత్సరానికి ఇంకా ఒప్పందం చేసుకోని కంపెనీలు నవంబర్ 10 లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గత 30 ఏళ్లుగా విత్తన పత్తి పంటకు ప్రఖ్యాతిగాంచిన జోగులాంబ గద్వాల జిల్లాలో కొంతకాలంగా ఒప్పందం, చెల్లింపుల - మిగతా4లో..




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## ఆల్మట్టి ఎత్తు పెంచితే

# పాలమూరు ఎడారే..

- కృష్ణా కాలువల్లో క్రికెట్ ఆడుకోవాల్సిందే..
- ప్రాజెక్టు ఆపే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేయాలి
- కర్ణాటకలో కాంగ్రెస్సే ఉన్నది..
- నాకు బీఆర్ఎస్‌తో సంబంధం లేదు..
- నేను ఎవరికీ ఏ టీం, బీ టీం కాదు..
- సామాజిక తెలంగాణే లక్ష్యం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబర్29, ప్రభాతవార్త:** " నారాయణ పేట్ కొడంగల్ ప్రాజెక్ట్ కూడా కట్టుకోండి. కానీ 80 శాతం పనులు పూర్తైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ ను పూర్తి చేయండి.. లేదంటే ఏపీ ప్రభుత్వం మన నీళ్లను తీసుకెళ్తుంది.. ఇప్పటికే కృష్ణా బేసిన్ నీళ్లను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.. గోదావరి నీళ్ల కోసం బనకచర్ల కూడా కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే ప్రయత్నం కూడా జరుగుతుంది. అదే జరిగితే కృష్ణా ప్రాజెక్ట్‌ల కాల్వల్లో క్రికెట్ ఆడుకోవాల్సిందే. చుక్క నీరు రాదని మహబూబ్ నగర్ ప్రజలకు చెబుతున్నా. దీన్ని ఆపే ప్రయత్నం ముఖ్యమంత్రి చేయాలి.." అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి పాలమూరు పులిబిడ్డను అని చెప్పుకుంటారు.. కానీ రెండేళ్లలో మహబూబ్ నగర్ టౌన్‌కు ఎన్నిసార్లు వచ్చారో చెప్పాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారానికి తప్ప మళ్లీ రాలేదని, మహబూబ్‌నగర్‌టౌన్‌కు కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేస్తారా లేదా చెప్పండని ప్రశ్నించారు. పదేళ్ల క్రితమే నిజామాబాద్‌లో అండర్ గ్రౌండ్ డ్రానేజీ చేశామని చెప్పారు. ఇప్పటికీ మహబూబ్‌నగర్‌లో మూడు రోజులకొకసారి నీళ్లు వస్తాయని స్థానికులు చెబుతున్నారని, అది బీఆర్ఎస్ తప్పా, కేసీఆర్ తప్పా అనేది ఇక్కడ చర్చ కాదని లోపాలను సరిదిద్దుకోవాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేస్తే మంచి పేరు వస్తుందని సీఎం గారికి సూచిస్తున్నా. కేవలం కేసీఆర్‌కు మంచి పేరు వస్తదనే ఉద్దేశంతో పనులు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెట్టకండి. నారాయణ పేట్ కొడంగల్ ప్రాజెక్ట్ కూడా కట్టుకోండి. కానీ 80 శాతం పనులు పూర్తైన ప్రాజెక్ట్‌ను పూర్తి చేయండి. లేదంటే ఏపీ ప్రభుత్వం మన నీళ్లను తీసుకెళ్తుంది. ఇప్పటికే కృష్ణా బేసిన్ నీళ్లను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. గోదావరి నీళ్లకోసం బనకచర్లకూడా కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే ప్రయత్నం కూడా జరుగుతుంది. అదే జరిగితే కృష్ణాప్రాజెక్ట్‌ల కాల్వల్లో క్రికెట్ ఆడుకోవాల్సిందే. చుక్క నీరు రాదని మహబూబ్ నగర్ ప్రజలకు చెబుతున్నా. దీన్ని ఆపే ప్రయత్నం ముఖ్యమంత్రి గారు చేయాలి.

**జడ్చర్ల ఎమ్మెల్యే గమ్మతున్నడు..**

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి మంచి పీఆర్ స్టంట్‌లు ఉన్నాయి. ఇక్కడి సెజ్ ముచ్చట రాగానే ఫోటోలకు ఫోజులు ఇస్తారు. కానీ గతంలో మాట ఇచ్చినట్లు కొల్లూరు మండలం తేవాలని, జడ్చర్ల ప్రభుత్వ హాస్పిటల్‌ను మళ్లీ 100పడకల హాస్పిటల్‌గా చేయాలని, వైద్యం అందక చనిపోయిన యువరైతుకు పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్, కరివెన - మిగతా4లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## మాతృ మరణాలను తగ్గించేందుకు

# తగిన చర్యలు తీసుకోవాలి

### నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో మాతృమరణాల సంఖ్యను తగ్గించేందుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో గుండుమల్, దామరగిద్ద, కోటకొండ, ధన్వాడ, నారాయణపేట అర్బన్ - మిగతా4లో..

## రోగులకు డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలి

**గోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త:** జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, అటెండెన్స్ వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు డెంగ్యూ పరీక్షలు కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా మలేరియా, డెంగ్యూకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో రూపొందించిన హెల్త్ యాప్‌లో టీబీ స్క్రీనింగ్, డయాబెటిస్ స్క్రీనింగ్‌కు సంబంధించిన రిపోర్టులను అప్లోడ్ చేయాలని ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయి నాథ్ రెడ్డి, వైద్యాధికారులు పరిమళ ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**పి వై ఎల్, జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య**

**గద్వాల టౌన్, అక్టోబర్29, ప్రభాతవార్త:** బెడ్‌రూమ్, కిచెన్, ఉన్నఇంటికి స్కూల్ పర్మిషన్ ఇవ్వడం ఏంటి అని పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య ప్రశ్నించారు. బుధవారం పి వై ఎల్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి దానమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిలో 140 మంది విద్యార్థులు, గురుకుల కోచింగ్, హాస్టల్ నడుపుతున్నారన్నరని, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా స్కూలు నడుపుతున్నారని ఆరోపించారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో ఉన్న శ్రీ భవిత విద్యాలయం స్కూల్ పర్మిషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న, విద్యార్థులకు మౌలికవసతులు అనగా ఆటస్థలం, ఆట వస్తువులు, లైబ్రరీ, బాత్రూం, ఫైర్ సేఫ్టీ, ల్యాబ్ (ప్రయోగశాల)ఇలా మొదలగు వసతులు ఏమి లేవనీ అన్నారు. గురుకులం కోచింగ్ పేరిట రెసిడెన్షియల్ పర్మిషన్ లేకుండా హాస్టల్ నిర్వహిస్తూ వేలకు వేల ఫీజులు దండు కుంటూ సీటువచ్చిన తర్వాత అదనంగా మరొక పది వేలు ఇవ్వాలంటూ స్కూలు యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్, జగ్గిరెడ్డిపల్లి భీమేష్, ఉప్పేర్ సాయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మా పోస్టులను రెన్యువల్ చేయండి

**అలంపూర్ అక్టోబర్ 28, ప్రభాతవార్త :** మా పోస్టులను రెన్యువల్ చేయాలని ల్యాబ్, టెక్నీషియన్స్ సెక్యూరిటీ గార్డ్స్ పోస్టులను రెన్యువల్ చేయాలని ఆస్పటాలకు సంబంధించిన సిబ్బంది ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ నాయకుడు శివ మాట్లాడుతూ, హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో నిర్వహించిన ప్రజా వాణి లో సి హెచ్. సి. అలంపూర్ హాస్పిటల్ లో ఔట్ సోర్సింగ్ పోస్టుల ప్రతిపాదనలు జిల్లా ఆఫీస్ నుండి పంపనందువలన ల్యాబ్ టెక్నీషియన్ 2, జె. ఎస్. డబ్ల్యూ.1, సెక్యూరిటీ గార్డ్స్ 2 పోస్టులు రెన్యువల్ కాలేదు. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు వేతనాలు రాకున్నా కుటుంబ పోషణ భారమైన కూడా విధులు నిర్వహిస్తున్నాము. మా పోస్టులు రెన్యువల్ అయ్యేలా సంబంధిత అధికారులకు ఆదేశించి మాకు న్యాయం చేయగలరని వినతి పత్రం సమర్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. శివ కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పి. రమేష్, ఎమ్. డి. రఫీ, కే. రాఘవేంద్ర పాల్గొన్నారు. మా పోస్టులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు.

## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**వీపనగండ్ల అక్టోబర్ 29, ప్రభాతవార్త ;** వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్ మండలంలోని పుల్కర్ జర్ల గ్రామంలోని పంటలను పరిశీలించారు. బుధవారం నాడు వేరుశనగ, మినుము వరి తదితర పంటలు ఇటీవల కురిసినటువంటి వర్షాలకు ఏమైనా దెబ్బతిన్నాయా అనే అంశాన్ని ఆయన వీపనగండ్ల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడు నీ , రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఆ గ్రామంలో వేరుశనగ పంటలను పరిశీలించిన ఆయన పంటలకు వివిధ తెగుళ్లు ఏమైనా ఆశించాయా అనే అంశాన్ని రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. అంతేకాక పంటలను పరిశీలించారు. వర్షాలు బాగా వస్తున్న సందర్భంలో పంట పొలాలకు తెగుళ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వాటికి పురుగుల యజమాన్యం తగిన పాలలో రైతులు చేసుకోవాలని సూచించారు. ఈయన వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి, మండల హార్టికల్చర్ అధికారి కృష్ణయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ కుమార్ రెడ్డి, రైతులు గోవిందు మద్గం నరేష్, జుర్రు శివుడు, సుదర్శన్ రెడ్డి, తదితరులు పంట పొలాలను పరిశీలించారు.

## గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం

**ఊట్కూర్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామం పశువైద్యశాలలో మండల పశువైద్య అధికారి డా. డి. సాయి వరుణ్ ఆధ్వర్యంలో ఆవులు, ఎద్దులు, గేదెలకు 7వ విడత గాలికుంటు ఫుట్ అండ్ మోత్ డిసీజ్ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సాయి వరుణ్ మాట్లాడుతూ గాలికుంటు అనేది పశువుల నోటిలో, కాళ్ల వద్ద గాయాలు, పుడుచులు ఏర్పడే వైరల్ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి వల్ల పశువులు ఆహారం తినకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, నడవడంలో ఇబ్బంది పడడం వంటి సమస్యలు వస్తాయని వివరించారు. పశువులకు సమయానుకూలంగా టీకాలు వేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి రక్షించుకోవచ్చని ఆయన రైతులకు సూచించారు. అలాగే పశువుల మెడలు శుభ్రంగా ఉంచడం, నీరు, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఇవ్వడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, పశుగణన సహాయకుడు జంగం శివప్రసాద్, ఆఫీస్ సబార్డినేట్ రాఘవరెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ ప్రాణాలను రక్షించిన ఎస్సై



మహిళను పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని హాజికన్‌పేటకు చెందిన చింతామణి (45) అనే మహిళ ఇల్లు మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో వర్షాల కారణంగా కూలిపోయింది. ఈ ఘటనలో ఆమె శిథిలాల కింద చిక్కుకొని కేవలం తల మాత్రమే బయటకు కనిపించే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన స్థానిక యువకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో సుమారు అరగంట పాటు కృషి చేసి చింతామణిని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఆమెను పోలీసు వాహనంలో నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వర్షాల సమయంలో పాత, బలహీనమైన ఇళ్లలో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలి ఎటువంటి ప్రమాద సూచన కనిపించినా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలి అని సూచించారు. జిల్లా ఎస్పీ డా. వినీత్, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందిని తక్షణ స్పందనతో మహిళ ప్రాణాలను రక్షించినందుకు అభినందించారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**చిన్న తప్పిదం పెద్ద ప్రమాదంగా మారొచ్చు**

**అనవసరంగా రోడ్లపైకి రాకండి అత్యవసర పరిస్థితుల్లో 100కి కాల్ చేయండి**

**చేపల వేట, వరద నీటిలో ఆటలపై కఠిన నిషేధం, ప్రజల ప్రాణ భద్రతే ప్రథమం**

**వనపర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో మొంథా తుఫాన్ దృష్ట్యా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయకూడదని, చేపల వేట లేదా నీటిలో ఆటల వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. వర్షాల ప్రభావంతో రహదారులు దెబ్బతినే అవకాశాలు ఉన్నందున అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 వనపర్తి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 6303923200 కు సమాచారం అందిస్తే తక్షణ సహాయక రక్షణ చర్యలకు వర్షాల సమయంలో ప్రజల రక్షణ కోసం వనపర్తి జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. జీవన రక్షణకే ప్రాధాన్యత ఇవ్వండి, రిస్క్ తీసుకోవద్దు, అని జిల్లా ఎస్పీ అన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలు రెండు రోజుల్లో ప్రారంభించాలి

**బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు**

**ఏర్పాటు చేయాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

**వనపర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త:** జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి కాబట్టి ఐకెపి సభ్యులకు కేటాయించిన అన్ని కొనుగోలు కేంద్రాలను రెండ్రోజుల్లో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అవసరమైన తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు తదితర పరికరాలను మార్కెటింగ్ శాఖ నుండి తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటికే శిక్షణ పొందిన సిబ్బంది ఖచ్చితంగా ఉండాలని అలా కాకుండా శిక్షణ పొందని వ్యక్తిని పెట్టి కొనుగోలు చేస్తే సంబంధిత ఎపియం పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ధాన్యం సేకరణ విషయంలో రాజీ పడవద్దని, నియమ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని, అందుకు రైతులకు సైతం తేమ, తాలు విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టడానికి నవంబర్ 14న అన్ని మండల కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులతో, గ్రామ పెద్దలు, కుల పెద్దలతో అవగాహన కార్యక్రమం చేపట్టాలని, బాల్య వివాహం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగే విధంగా ఉంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యాలయాల నుండి మధ్యలోనే చదువు మానేసిన అమ్మాయిల జాబితా ఇవ్వడం జరిగిందని, జాబితా ప్రకారం ఇళ్లకు వెళ్ళి అమ్మాయి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపియం లను ఆదేశించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రతి మండలం నుండి స్వయం సహాయక సభ్యులకు కనీసం ఒక యూనిట్ నెలకొల్పే విధంగా ఎపియం లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకోడానికి మహిళా సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని తద్వారా వారు అధిక వడ్డీకి రుణాలు తీసుకోకుండా తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు పొంది ఇల్లు నిర్మించుకుంటారని తెలియజేశారు. ఎక్కడైనా బ్యాంకర్లతో సమస్యలు ఉంటే సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పిడి డిఆర్డిఓ ఉమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, సహాయ లీడ్ బ్యాంక్ మేనేజర్ సాయి, డిపియంలు, ఎపియం లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన : కమిటీ చైర్మన్

**ఆత్మకూర్ అక్టోబర్ 29, ప్రభాతవార్త;** పూర్వ వైభవం కోల్పోయిన ఆత్మకూరు పట్టణాన్ని అభివృద్ధి పరిచయ కార్యక్రమంలో భాగంగా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి జూరాల వద్ద కృష్ణా నదిపై కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం 123 కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ప్రభాతవార్తకు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం రోజు ఆత్మకూరులో ప్రభాతవార్తతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేగా ఆత్మకూర్ పట్టణ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతానని ఇచ్చిన హామీ మేరకు గద్వాల్, మంత్రాలయం వరకు ఆత్మకూర్ పట్టణ ప్రజల సులువుగా ప్రయాణించేందుకుగాను ప్రస్తుతం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్నటువంటి బ్రిడ్జికి అదనంగా వాహనాల రాకపోకల నిమిత్తం 123 కోట్ల నిధులు విడుదల చేయించి అదనపు బ్రిడ్జి నిర్మాణం కోసం ఆన్లైన్ టెండర్ దాఖలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. గత పది సంవత్సరాలుగా బ్రిటి నిర్మాణం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం పట్ల ఆత్మకూరు నిరాదరణకు గురైందని ఆత్మకూర్ పట్టణానికి పూర్వవైభవం తెచ్చే విధంగా రాష్ట్ర మంత్రి అహర్నిశలు కృషి చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆయన అన్నారు. అదనపు బ్రిడ్జి నిర్మాణం కోసం ఆన్లైన్ టెండర్ దాఖలు పూర్తయిన నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన గావించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గాన్ని మూడు ముక్కలుగా చేయడంతో తీరని అన్యాయం జరిగిందని తద్వారా పూర్వవైభవం తెచ్చేందుకుగాను రాష్ట్ర మంత్రి చేస్తున్న ప్రయత్నాలకు మక్తల్ నియోజకవర్గం ప్రజలు ఎల్లవేళలా అండదండలు అందించి సంపూర్ణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆలయాల పవిత్రపై బురదజల్లే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

**అలంపూర్ రైతు సంఘం నాయకులు డిమాండ్**



రైతు సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

**అలంపూర్ అక్టోబర్ 28, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అష్టదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను కొంతమంది సామాజిక మాధ్యమాలలో ఆలయాల ప్రతిష్టను దిగజార్చులను చేస్తున్నారని అట్టి వారిపై కేసు నమోదు చేయాలని బుధవారం రోజు ఆలంపూర్ రైతు సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ రెడ్డి, ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అందరూ కలిసి అలంపూర్ ఎస్. ఐ. వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. పవిత్రమైనశక్తిపీఠమైన జోగులాంబదేవి బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలలో కొంతమంది కావాలని ఆలయాల ప్రతిష్టను దిగజార్చుతున్నారని వారి సందర్భంగా ఫిర్యాదుచేయడం జరిగింది. సామాజిక మాధ్యమాలలో దేవాలయ సిబ్బందిపై, అధికారులపై అనవసరంగా పోస్టులు చేయడం తగదన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ, డీజీపీ, స్పందించి వెంటనే శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి, దక్షిణ కాశిగా పిలవబడే బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల ప్రతిష్టను కాపాడాలని అన్నారు. ఏదైనా ఉంటే వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఆలయాలపై నిత్యం వివాదాలు సృష్టిస్తూ సోషల్ మీడియాలో పెట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. అనవ సరంగా సోషల్ మీడియాలో పెడుతున్న వ్యక్తులపై చట్ట రిత్యా చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని ఆలంపూర్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎటువంటి వివాదాలు లేకుండా ఆలంపూర్ ఆలయాలకు భక్తులు వేలాదిమందిగా ప్రతిరోజు వస్తూ దర్శనం చేసుకుంటూ వెళ్తున్నారని కానీ కొంతమంది తన స్వార్థ పూరితతో ఆలయాల ప్రతిష్టను భంగం చేకూరుస్తున్నారని వీరికి త్వరలోనే నిజ నిజాలు వాస్తవాలు తెలుస్తాయని రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షులు వెంకటనారాయణ రెడ్డి, దుబ్బ వెంకటేశ్వర్లు, నాగమద్దిలేటి, ధర్మరాజు, నాగార్జున రెడ్డి, శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి విడుదలైన నిధులు కేంద్ర ప్రభుత్వానివే

**యుఐడిఎఫ్ నిధులు 18.70**

**కోట్లలో 80% 15 కోట్లు కేంద్ర వాటా**

**కేవలం 20 శాతం మ్యాచింగ్**

**గ్రాంట్ కే కాంగ్రెస్ నాయకుల ప్రగల్బాలు**

**బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ**



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

**వనపర్తి ప్రతినిధి, అక్టోబరు 29 ప్రభాతవార్త :** వనపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి విడుదలైన 18.70 కోట్లలో 80% 15 కోట్లు కేంద్ర ప్రభుత్వానివేనని బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ స్పష్టం చేశారు. బుధవారం బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయల సమావేశానికి డి. నారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్స్ (యుఐడిఎఫ్) ద్వారా 11 మున్సిపల్ కార్పొరేషన్లు 36 మున్సిపాలిటీలలో డ్రైనేజీ, సిసి రోడ్లు, త్రాగునీరు సరఫరాకై 2954.52 కోట్లు మంజూరు చేసిందని, అందులో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హౌసింగ్ బ్యాంకు (ఎన్‌హెచ్‌బి) ద్వారా 80% నిధులు 2352.42 కోట్లు విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటా కేవలం 523 కోట్లేనని వివరించారు. దీనిలో భాగంగానే వనపర్తి మున్సిపాలిటీకి 18.70 కోట్లలో 15 కోట్లు వాటా కేంద్రానిదేనని, కేవలం 3.70 కోట్లు రాష్ట వాటా కలిగి ఉందని అన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కార్యదర్శి డా. టీకే శ్రీదేవి స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. కానీ స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కాంగ్రెస్ నాయకులు పూర్తిగా రాష్ట బడ్జెట్ మేమే ఇస్తున్నామని ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 80% నిధులను ఆధారాలతో సహా ఏ వేదిక ద్వారానైనా నిరూపించడానికి బిజెపి సిద్ధంగా ఉందని, సీఎం రేవంత్ రెడ్డి 1000 కోట్ల నిధులపై ఎమ్మెల్యే మేఘా రెడ్డి వనపర్తి ప్రజల పట్ల అభిమానం చిత్తశుద్ధి ఉంటే జీవోలు, ఆర్థిక శాఖ అనుమతులు ఎక్కడెక్కడ శంకుస్థాపనలు జరిగి పనులు కొనసాగుతున్నాయో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, సర్పంచ్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ తిరుమలేష్, కార్యాలయ కార్యదర్శి ఆగపోగు కుమార్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

**పెబ్బేరు, అక్టోబరు 29 ప్రభాతవార్త :** శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ముగ్గురు స్వాములు అయ్యప్ప స్వామి దర్శనానికి పెబ్బేరు నుంచి శబరిమలై వరకు మహా పాదయాత్రగా బయలుదేరారు. పెబ్బేరు నుంచి శబరిమలై కి 1000 కిలోమీటర్ల పాటు ఇరుముడితో గోనెల అరవిందు, కార్తిక్, నాగరాజు ముగ్గురు స్వాములు బుధవారం రోజు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకొని బయలుదేరారు. ఈ స్వాములు ప్రతిరోజూ 40 నుంచి 50 కిలోమీటర్లు నడుస్తూ 30 రోజుల్లో శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకుంటారనీ పెబ్బేరు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వారు తెలియజేశారు.



భగీరథ వాటర్ పైప్‌లైన్ నగిలి రొడ్డుపై వరదలై ప్రవహిస్తున్న దృశ్యం

## భూత్పూర్‌లో పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

**- హైవే అంతా జలమయం..**

**- పట్టణ ప్రజలు, ప్రయాణీకులంతా అతలాకుతలం..**

**భూత్పూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** అసలే మంథా తుఫాన్.. రెండ్రోజులుగా ఎడతెరిపిలేని వర్షం.. ఆపై చలి, ఈదురుగాలులతో సతమత మౌతున్న భూత్పూర్ పట్టణ ప్రజలు, ప్రయాణీకులు భూత్పూర్ జాతీయ రహదారి-44 కూడలిలో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ బుధవారం పగిలి పోవడంతో దీనిక వర్షం నీటి వరద తోడవ్వడంతో హైవే అంతా జలయమైంది. ఒక్కసారిగా నీరు రోడ్లపైకి వరదలై పారడంతో వాహనాలు, పాదచారులు, ద్విచక్రవాహన చోధకులకు పెనుభారంగా మారింది. రోడ్డుపైని పల్లంవైపు ప్రవహిస్తూ ఇళ్లల్లోకి చేరడంతో జనం అవస్థలు పడ్డారు. దాదాపుగా రెండు గంటలపాటు వరదనీటితో ట్రాఫిక్ స్తంభనేర్పడింది. మంథా తుఫాన్ కారణంగా బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనద్రోణి వల్ల గడిచిన మూడ్రోజులుగా భూత్పూర్ పట్టణంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. భూత్పూర్ పరిసర ప్రాంతాలు, గ్రామాలలోని చెరువులు, కుంటలు నిండి వాగులు, వంకలు పొర్లిపారుతున్నాయి. కథాల్‌ఖాన్‌చెర్వు, ఊరచెర్వు, మొగుళ్లచెర్వు, నాందారిచెర్వు, బోడచెర్వులు నిండుకుండల్ని తలపిస్తున్నాయి. బుధవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యాలయాలను మూసివేశారు.

## మంగంపేటలో 1 నుండి వీరభద్ర విగ్రహ ప్రతిష్ట, చండీయాగం

**మల్దకల్ అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మల్దకల్ మండలం మంగంపేట గ్రామంలో వెలిసిన శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో నవంబర్ 1 నుండి 5 వరకు శ్రీ వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట, చండీయాగం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు, పెద్దలు తెలిపారు. దైవజ్ఞులైన శ్రీశ్రీశ్రీ శంభు సోమనాథ స్వామి వారిచే పూజా కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కటాక్షానికి పాత్రులు కావాలని కోరారు.

## మాజీ ఎమ్మెల్యే ఆల పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల, తదితరులు

**చిన్న చింతకుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ధమగ్నాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డా. సురేందర్ రెడ్డి తండ్రి పి. ఎల్లారెడ్డి మంగళవారం మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి పార్థివ దేహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, రైతు సమితి జిల్లా సభ్యులు కరుణాకర్ రెడ్డి, మోహన్‌గౌడ్, దశరథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలంటే సాంకేతికతపై అవగాహన అవసరం



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల టౌన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన పెంచుకొని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా పాఠాలు బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. బుధవారం గద్వాల బాలభవన్ లో విద్యాశాఖకు సంబంధించిన పలు యాప్ లు, వివిధ పోర్టల్ ల గురించి జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ, ఇతర టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ పనితీరు మెరుగుపడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా తమ విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రయోగపూర్వకంగా, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మన జిల్లా మెరుగైన స్థానాన్ని పొందేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించినందున, దాని ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. తాను తరచు జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యా సంస్థలను సందర్శిస్తున్నానని, విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చాలామంది విద్యార్థులు సరిగ్గా చదవలేక పోతున్నారని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కెరీర్‌కు ఉపయోగపడేలా పాఠ్యాంశాలు బోధించాలని, ఫలితంగా వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. మన రాష్ట్రం విద్యారంగంలో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యా వ్యవస్థ ఏ విధంగా ఉందో పరిశీలించేందుకు ప్రతి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి త్వరలోనే విదేశాలకు పంపుతున్నట్లు తెలిపారు. విద్యాపరంగా జోగులాంబ గద్వాల జిల్లా మెరుగైన స్థానంలో ఉండాలంటే ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అలసత్వం వహించే వారిని ఉపేక్షించేది లేదని, శాఖా పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రధానోపాధ్యాయుల హ్యాండ్బుకను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు శాంతిరాజు, హంపయ్య, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు

## - అభినందించిన జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్



హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** గత కొన్ని రోజుల క్రితం మంచాలకట్ట గ్రామం సాకలి రాముని గుట్టపై మహిళను పెట్రోల్ పోసి నిప్పంటించి చంపిన ఘటన కేసును పోలీసులు ఛేదించారు. నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ మాట్లాడుతూ డిఎస్పి బుర్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొల్లాపూర్ పోలీసులు కేసు విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొల్లాపూర్ ఇందిరా కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న మృతురాలు స్వర్ణలత (32) కు అదే కాలనీకి చెందిన విజయ్‌కుమార్ (23)తో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నారు. ఇది ఇలా ఉండగా నేరస్థుడు విజయ్ కుమార్ వేరే అమ్మాయితో ప్రేమ సంబంధం పెట్టుకున్నాడని తెలుసుకున్న మృతురాలు స్వర్ణలత విజయ్‌కుమార్‌తో గొడవ పడింది. దీంతో స్వర్ణలత అడ్డు ఎలాగైనా తప్పించుకోవాలని పథకం ప్రకారం తేదీ:08/10/2025 నాడు విజయ్‌కుమార్ తన పల్సర్ బైక్ టీజీ31 9165 నెంబర్ గల బైక్‌పై ఎక్కించుకొని కొల్లాపూర్ లోని మంచాలకట్ట, చాకలి రాములు గుట్ట దగ్గరికి తీసుకొని వెళ్లి ఆమెను పథకం ప్రకారం చంపేశాడు. ఎవరికి అనుమానం రాకూడదని మంచాలకట్ట గ్రామంలోనికి వెళ్లి పెట్రోల్, అగ్గిపెట్ట కొనుగోలు చేసి ఆమె మృతదేహంపై పోసి నిప్పటించాడు. విచారణలో భాగంగా అతనిపై అనుమానం రావడంతో కస్టడిలోకి తీసుకొని విచారించగా నేరం తానే చేశానని విజయ్ కుమార్ ఒప్పుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్సైలు రామన్ గౌడ్, రిషికేష్‌లను ఎస్పీ అభినందించారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**మక్తల్ టౌన్, అక్టోబరు29 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పి డా.వినీత్ ఉత్తర్వుల మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాల్లో భాగంగా మక్తల్ పట్టణ కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పోలీసులు, యువత అందరూ కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించి పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మక్తల్ సీఐ రామలాల్ మాట్లాడుతూ ప్రజాల రక్షణలో శాంతిభద్రతల పరిరక్షణలో నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తిస్తూ విధి నిర్వహణలో భాగంగా పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంఘ విద్రోహ శక్తులచే పోరాడి వీరమరణం పొందిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించి పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐ 2 రేవతి, పోలీసులు, యువత, ప్రజలు మొదలగువారు పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వను పరిశీలించిన ఆర్డీవో, తహసీల్దార్



తోటపల్లి వద్ద ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న అధికారులు

**కల్వకుర్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని వెంకటాపురం గ్రామం వద్ద కేఎల్ఐ కాల్వఉధృతంగా ప్రవహిస్తూ గ్రామంలోకి నీరు చేరుకుందనే సమాచారం తెలుసుకున్న ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహశీల్దార్ ఇబ్రాహీంలు పరిశీలించి ఎక్కడైనా గండీలు పడే ప్రమాదం ఉన్న చోట జేసీబిల సహాయంతో మొర్రం పోయించారు. అదే విధంగా తోటపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు ప్రమాద కరంగా ఉన్న సందర్భంగా అక్కడ పరిశీలించి ప్రజలు దాటకుండ చూడాలని నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి వెంట ఎస్సై మాధవరెడ్డి, స్థానిక రైతులు తదితరులు ఉన్నారు.

## వర్షానికి కూలిన ఇండ్లు

**వెల్దండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మోంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో మూడు ఇండ్లు కూలిపోయినట్లు తహసిల్దార్ కార్తీక్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన మెరుగు వెంకటయ్య, పెద్దాపూర్ గ్రామానికి చెందిన కొప్పుల భారతమ్మ, కోట్ర గ్రామానికి చెందిన మున్నికి చెందిన ఇండ్లు కూలిపోయాయని, ఎవరికి ఎటువంటి ప్రమాదాలు జరగలేదన్నారు. కురుస్తున్న వర్షాలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలని శిథి లావస్థలో ఉన్న ఇండ్లలో మాత్రం ఎవరు ఉండకూడదని అన్నారు.

## ఖోఖో క్రీడల్లో రాణించిన విద్యార్థినికి సన్మానం

**కల్వకుర్తి, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపు చదువుతున్న కుమారి సుప్రియ కర్ణాటక రాష్ట్రంలోని దావనగెరి జిల్లాలో జరుగుతున్న జాతీయస్థాయి క్రీడా పోటీలలో ఖో ఖోలో కాంస్య పథకం సాధించడం కళాశాలకు చాలా గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ యామిని తెలిపారు.కాంస్య పతకం సాధించిన కుమారి సుప్రియను ప్రిన్సిపాల్ యామిని సన్మానించి పిఈటిలు బాలశ్రీ, లలితలు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా ఎన్నో పతకాలు సాధించి కళాశాలకు పేరు తీసుకొని రావాలని విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పెబ్బేరు అభివృద్ధిని జీవోలతోనే సరిపెడుతున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ, మండల అభివృద్ధిపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సీత కన్ను వేశారని మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్లు కరుణశ్రీ, కర్రెస్వామిలు ఆరోపించారు. బుధవారం పెబ్బేరు ప్రెస్ క్లబ్లో నిర్వహించిన ప్రెస్ మీట్లో వారు మాట్లాడారు. మంగళవారం నాడు కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి గత బీఆర్ఎస్ పాలకవర్గం, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పెబ్బేరు పట్టణాన్ని అభివృద్ధి చేయలేదని అవాక్కులు, చవాక్కులు పేల్చారని అన్నారు. రూ.4 కోట్ల మిగులు బడ్జెట్ ను డివైడర్ పేరిట వాడుకొని కమీషన్ దందాలు చేశారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మున్సిపాలిటీలో ఏ పని చేయాలన్నా ముందుగా బీఆర్ఎస్ కౌన్సిలర్ల కంటే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకే అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రతి తీర్మాణం వారి ఆమోదం పొందిన తరువాతనే ప్రతిపాదించే వారమని చెప్పారు. ఆనాడు మిగులు బడ్జెట్ వాడుకున్నారని ఎందుకు ప్రశ్నించలేదు అని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామని సమాచారం తెలుసుకొని ఒక రోజు ఎమ్మెల్యేతో భేటీ అయి వాట్సాప్ గ్రూపుల్లో ఆ విషయాన్ని పోస్ట్ చేసి తాము నిజాయితీగా చేసిన ధర్నాను అభాసుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రోజూ రావాల్సిన చెత్త ట్రాక్టర్లు 3 రోజులకోసారి వస్తున్నాయని, చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో దోమలు వ్యాపించి పిల్లలు,పెద్దలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఫాగింగ్ కూడా సరిగా చేయడంలేదని అన్నారు. సంతకు మేము 16 ఎకరాలు తీసుకొచ్చినం, మీరు 30.19 ఎకరాలు తీసుకొస్తామని గాలి మాటలు చెప్పారు తీసుకురండి అని సవాల్ విసిరారు. అవసరమైతే పెబ్బేరు అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులతో డిబెట్ పెట్టి ప్రజల మధ్యలో కూర్చొని ఎలాంటి చర్చకైనా తాము సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి, నాయ కులు చిన్న ఎల్లారెడ్డి, పార్వతి, రాజశేఖర్, భారతమ్మ, సాయి రెడ్డి, వేణు, మోహన్న, బాలస్వామి, కతలయ్య, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోసం కాంగ్రెస్ మరోస్టంట్ : జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

**జడ్చర్ల, అక్టోబర్ 29,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడానికి ఏ మోసమైన చేయగలదని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. గతంలో ముస్లిం అభ్యర్థిని ఎమ్మెల్సీగా నామి నేట్ చేసి గవర్నర్ వద్ద ఆమోదం తెచ్చుకోలేకపోయిందని ఆరోపించారు. ఇప్పుడు మరోసారి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవిపై స్పష్టత లేకముందే ఆయనకు మంత్రిపదవి అంటూ మరో నాటకానికి తెరలేపిందని దుయ్యబట్టారు. రెండు సంవత్స రాలుగా ముస్లిం సామాజిక వర్గానికి ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇవ్వలేదు ఇప్పుడు కేవలం ముస్లింల ఓట్ల కోసం ఇంత దిగజారి మభ్యపెట్టలిసిన అవసరం లేదని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. హామీలు అమలుచేయకుండా కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలు ప్రజల దృష్టిలో ఉన్నాయని గుర్తుచేశారు. ఎన్నికల వచ్చినప్పుడు స్టంట్‌లు చేయడం కాంగ్రెస్‌కు అలవాటేనని పేర్కొన్నారు.

## భూ రికార్డులను పరిశీలించిన రెవిన్యూ అధికారులు

**ఇటిక్యాల అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెవిన్యూ గ్రామాల వారిగా భూ రికార్డులను బుధవారం తాహ సిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో భూ రికార్డులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలలో గల ప్రభుత్వ భూములు. లావాని. మరియు అసైన్డ్. సిలింగ్. ప్రభుత్వ భూముల ఇళ్ల స్థలాల వివరాలు వంటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.లు మనోహర్. మదన్ మోహన్. జి పి ఓ లు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో కట్టెల పొయ్యి వంటకు స్వస్తి చెప్పాలి

- గ్యాస్ సిలిండర్ ద్వారానే వంట చేసే విధంగా చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ పాఠశాలలను విద్యాధికారులు నిత్యం సందర్శించాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యాధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

**వనపర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ ద్వారానే మధ్యాహ్న భోజనానికి వంట చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో కట్టెల ద్వారా వంట చేసే పద్ధతికి స్వస్తి చెప్పాలని, అన్ని పాఠశాలల్లో గ్యాస్ సిలిండర్ ద్వారానే మధ్యాహ్న భోజనానికి వంట చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఎల్పిజి కనెక్షన్ ప్రతి పాఠశాలలో తీసుకునే విధంగా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.రాబోయే నెల రోజుల్లో కనెక్షన్లు తీసుకునే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలుతీసుకోవాలన్నారు. అదేవిధంగా, మండల విద్యా శాఖ అధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్లు ప్రభుత్వ పాఠశాలల్లో నిత్యం సందర్శనలు చేయాలన్నారు. పాఠశాలల విజిట్స్‌కు సంబంధించి అక్టోబర్ నెలలో నిర్దేశించిన లక్ష్యాలను రాబోయే రెండు రోజుల్లో సాధించాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడి జనరేషన్‌లో మెరుగుదల కనిపించిందని, ఇంకా వేగంగా అపార్ ఐడి జనరేషన్ ప్రక్రియ నిర్వహించి మొత్తం విద్యార్థులకి పూర్తి చేయాలన్నారు. ఇక గణితంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారు మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణిత విషయానికి సంబంధించిన మార్కుల రిపోర్టులను ఎప్పటికప్పుడు నివేదించాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. అదే విధంగా పాఠశాలల్లో విద్యార్థులకుహెల్త్ చెకప్స్ చేయించడమే కాకుండా సమాచారాన్ని సంబంధిత పీఎం పోషన్ పర్ఫామెన్స్ పోర్టల్ లో అప్డేట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బందికి సంబంధించిన ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ సైతం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, మండల విద్యాశాఖ అధికారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నారాయణపేట వీర ధర్మజ మాణికేశ్వరి మాత ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు

**నారాయణ పేట, అక్టోబరు 29 ప్రభాతవార్త:** వీర ధర్మజ మాణికేశ్వరి మాత శివైక్యంపై నిరాధారమైన వ్యాఖ్యలు చేసిన నల్లగొండ జిల్లా వాస్తవ్యులైన ఈశ్వరమ్మ రణధీర్లపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని నారాయణపేట వీర ధర్మజ మాణికేశ్వరి మాత ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు ఏవి మందార, బండిశివరాంరెడ్డి, వాల్వేకర్ నికేతన్ తమ్మలి సత్యనారాయణ, కె. శ్రీనివాస డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్బులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నల్గొండ జిల్లా కేంద్రం గంధం గూడలో గల శ్రీ మణికేశ్వరి మాత ఆశ్రమంలో ఈశ్వరమ్మ రణధీర్ తదితరులు సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ మా నాన్న ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశాడని ఈ ఆశ్రమానికి నేనే పీఠాధిపతినని అంటూ వారి స్వలాభం కొరకై అమ్మవారి శివైక్యంపైఅనుచిత వ్యాఖ్యలు చేస్తూ యానగుంది సూర్య నంది క్షేత్రం కార్యదర్శి అయిన శివయ్య స్వామి తదితరులపై నిరాధారమైన ఆరోపణలు చేసి కోట్లాదిమంది అమ్మ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అమ్మవారి ఆశ్రమాలు భక్తులు ఏర్పాటు చేసుకొని అక్కడ ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తు అహింస ప్రచారం చేస్తున్నారు. ఆయాఆశ్రమాలకు భూదాతలు అయినటువంటి వారి కుటుంబ సభ్యులకు ఆశ్రమాలపై ఎటువంటి అధికారం ఉండదని గుర్తు చేశారు. కేవలం అక్కడ భక్తులు ఏర్పాటు చేసిన కమిటీల ద్వారానే ఆశ్రమ నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు బండి మల్‌రెడ్డి, మన్నే జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

**నర్వ, అక్టోబరు 29 ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్వ సొసైటీ చైర్మన్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎం.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నర్వ మండల కేంద్రంలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం చైర్మన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లు అమ్మే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం రైతులకు క్వింటాల్ వరికి ఏ గ్రేడ్ ధాన్యానికి 2389,బి గ్రేడ్ ధాన్యానికి రూ.2369 మద్దతు ధరకల్పిస్తుందని తెలిపారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే కొనుగోళ్లు వేగవంతం అవుతాయని తెలిపారు. రైతులు ఎవరూ కూడా దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరకు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అఖిలరెడ్డి, సహకార సంఘం పాలక వర్గ సభ్యులు ఏ.వివేకానంద రెడ్డి, యం రామేశ్వర్‌రెడ్డి, బి.లింగన్న, యస్.వెంకటేశ్వరరెడ్డి, కె.రాములు నాయక్, నడిపి బుచన్న, బి.శ్రీనివాస్ రెడ్డి, పల్లె శేఖర్, కాంగ్రెస్ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి, నాగన్న, వివేకానంద రెడ్డి, శరణప్ప, శ్రీనివాస్ రెడ్డి, అయ్యప్ప రెడ్డి,నరేందర్‌రెడ్డి,లంకాల జనార్దన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు

**నీట మునిగిన పంటలు.. నిలిచిపోయిన రాకపోకలు**

**దిగ్బంధంలో రహదారులు... మురుగు కాల్వల నిర్వహన సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి చేరిన వరద నీరు**





పోలీస్‌స్టేషన్‌లోకి చేరిన వర్షపు నీరు

**వంగూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలు జలమయమై నీటి కుంటల దర్శనమిస్తున్నాయి. గ్రామాలలో మురుగు కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వరద నీరు ఇళ్లలోకి చేరుకొని ఇంటి పరిసర ప్రాంతమంతా చిన్నపాటి కుంటల తలపిస్తూ ఉండడంతో గ్రామ ప్రజలు నాన్న అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటేమండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాల యాలు, తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం పోలీస్ స్టేషన్ వరద నీటితో మునిగిపోయాయి. తహసీల్దార్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో వరద నీరు చెరువుల తలపిస్తుంది.దీంతో కార్యాలయాలకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోవడంతో వేసిన తాళం తీయకుండానే ఉండా ల్సిన పరిస్థితి నెలకొంది. వంగూర్,కల్వకుర్తి ఎమ్మెల్యే వంగూర్ - కల్వకుర్తి వెళ్లే రహదారిపై ఉధృతంగా వరద నీరు ప్రవహి స్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.పోలీస్ సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా తగు చర్యలు చేపట్టి బారికేడ్లను ఏర్పాటు చేశారు.రైతులు సాగుచేసిన పంట పొలాలలో పత్తి వరి చేను నీట మునిగడంతో రైతన్న పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయని చెప్పుకోవచ్చు.

## పొంగి పొర్లుతున్న వాగులు



**వెల్దండ, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** మోంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని గాను గట్టు తాండవాగు బొల్లంపల్లి–బైరాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గ్రామాలలో ఉన్న చిన్నపాటి చెరువులో కూడా నిండి అలుగు పారుతున్నాయి.మండల కేంద్రం నుండి చారకొండకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న బైరాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి. ఎస్సై కురుమూర్తి వాగు వద్ద ప్రజలు వాహనాలు దాటకుండా చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేశారు.

**బ్రిడ్జ్ నిర్మాణానికి ఎదురుచూపులేనా...** గత మూడు సంవత్సరాల కింద ఎగువన కురిసిన భారీ వర్షాలకు బైరాపూర్ వాగు ఉధృతంగా ప్రవహించి బ్రిడ్జ్ పూర్తిస్థాయిలో దెబ్బ తినడంతో గత ప్రభుత్వంలో తాత్కాలిక కొంత మరమ్మతులు చేపట్టి రాకపోకలు చేపటారు. తుఫాను ప్రభావంతో ఎగువ నుండి ఉధృతంగా వాగుపారు తుండడంతో నిర్మాణానికి నోచుకోని బ్రిడ్జిపై నుండి ఉధృతంగా వాగుపారుతుంది. ప్రమాదకర స్థాయిలో ఉన్న బ్రిడ్జిపై నుండి ప్రజలు, వాహనాలు దాటిన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నూతన బ్రిడ్జ్ ఏర్పాటు చేసినట్లయితే రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**వంగూరు, అక్టోబర్29 ప్రభాతవార్త:** మోంథా తుఫాన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అచ్చంపేట నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంగూరు మండల కేంద్రంలోని తహసిల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ పూర్తిగా జలమయం కావడంతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రజలు, అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించారు. వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకుని,అధికారులను అప్రమత్తం చేసి, అవసరమైన జాగ్రత్తల కోసం తగిన ఆదేశాలు ఇస్తూ, ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తహసీల్దార్,ఇరిగేషన్, పోలీస్, విద్యుత్ సంబంధిత అధికారులు ఇప్పటికే సహాయక చర్యలు చేపడుతున్నారన్నారు. ఇళ్ల నుంచి ఎవరు బయటికి రావద్దని, శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో గాని మట్టి ఇండ్లలో గాని, విద్యుత్ స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఇరిగేషన్, పోలీసు అధికారులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ప్రజలు ఎవరు కూడా చెరువులు వాగులు ప్రవహిస్తున్న ప్రదేశంలోకి వెళ్లకూడదని ఆయన పేర్కొన్నారు.ఆయన వెంట అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



అధికారులకు తగు సలహాలు, సూచను చేస్తున్న దృశ్యం

## తుఫాన్ ప్రభావం.. నీట మునిగిన వరిపంట

మొదటి పేజీ తరువాయి భాగం..

బారిన పడిన పంటలు ఎందుకు పనికిరావని రైతులు మదన పడుతున్నారు.ప్రభుత్వం తమనుఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.అప్పులు చేసి పెట్టినపెట్టుబడి మెత్తం వర్షానికి కొట్టుకుపోవటంతో రైతులు తీవ్రఆవేదన చెందుతున్నారు.మండలంలో వర్షం నీరుపొలాల నుంచి బయటకు వెళ్లటానికి కొన్ని రోజులు సమయం పడుతుందని రైతులు తెలిపారు. ఇలా నీటిలో నానిన వరి పంటచివరికి గింజకూడా దక్కదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంట నేలకొరవడం నీట మునగడంతో ఆరుగాలం కష్టించిన కష్టానికి పెట్టుబడి సైతం ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ అధికారులు,ప్రభుత్వం, ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## అన్నదాతలు ఆందోళన పడవద్దు

మొదటి పేజీ తరువాయి భాగం..

నిర్వాహకులు తగుచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప,మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి మాజీ ఎంపీపీకిచ్చారెడ్డి, శంకర్‌నాయక్,సింగల్ విండో అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, రఘుపతిరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి. కృష్ణ, పట్టణ ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్ రెడ్డి, ఎత్తం రవి, లక్కాకుల సతీష్, గోపాల్‌పేట ఉమ్మడి మండలాల ఇంచార్జ్ సత్యశీలారెడ్డి,పట్టణ మాజీ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు,జిల్లా అధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళా సంఘాలసభ్యురాలు, రైతులు పాల్గొన్నారు.

## మాతృ మరణాలను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

హెల్త్ సెంటర్ల పరిధిలోజరిగిన ఎనిమిది మాతృమరణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండాముందస్తు చర్యలు తీసుకోవాలని గర్భిణీల ఆరోగ్యంపై ఆశా ఏఎన్ఎంలు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమా వేశం నిర్వహించాలని సూచించారు. మాతృ మరణ నివేదికలు భవిష్య త్తు చర్యలకు మార్గదర్శకమని జిల్లా వైద్యఅధికారి డా. జయచంద్ర మోహన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అందరూ సమిష్టిగా పని చేసి మాతృ మరణాలను పూర్తిగా తగ్గించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డా.కే.మల్లికార్జున్, డా.శైలజ,డా.సుధేష్ణ,డా.తేజస్విని,108 కోఆర్డినేటర్ రాఘవేందర్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన పత్తి రైతులకు ఇబ్బందుల్లేకుండా కంపెనీలు సహకరించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

విషయంలో సమస్యలు వస్తుండడంసరికాదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కంపెనీలు సహకరించకుంటే వారి లైసెన్స్ రద్దు చేసేందుకు ప్రభుత్వానికినివేదిస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా పలువురు ఆర్గనైజర్లు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చెల్లింపులు, ఒప్పందం విషయంలో ఉన్న సమస్యలను ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.కొన్ని కంపెనీలు ఏళ్ల తరబడిగా బకాయిలు చెల్లించడం లేదని, ఫలితంగా చిన్న ఆర్గనైజర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు.నాలుగైదు కంపెనీలు చేసుకున్న ఒప్పందం కంటే తక్కువ ధరలు చెల్లిస్తున్నాయని, సకాలంలో చెల్లింపులు చేయడం లేదని విమర్శించారు. అనంతరం ఆయా కంపెనీల వారీగాగత సీజన్లో ఉన్న బకాయిలు, సాగు చేసిన విస్తీర్ణం వివరాలు,ఒప్పందం చేసుకోవడంలో ఉన్న సమస్యల గురించి క్షుణ్ణంగాకలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి వ్యవసాయ అధికారి జగ్గు నాయక్, ఏడిఏ సంగీతలక్ష్మి, సీడ్ఆర్గనైజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, వివిధ కంపెనీల ప్రతినిధులు, సీడ్ ఆర్గనైజర్లు, పలువులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు ఎడారే..

మొదటి పేజీ తరువాయి భాగం..

రిజర్వాయర్లను తర్వగా పూర్తి చేయాలని కోరారు.

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే కాంగ్రెసా..బీజేపీయా..** మహబూబ్ నగర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ బీజేపీయా అర్థం కావడం లేదని కవిత అన్నారు.మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నంశ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీయో, బీజేపీయో తెలియటం లేదని, “తమ ప్రభుత్వం 2 లక్షల కోట్లు అప్పు తెచ్చిఏం చేసిందో…మాదగ్గర 2 లక్షలు కూడా లేవని స్వయంగా వాళ్ల పార్టీ ఎమ్మెల్యే అంటున్నారని, సిఎంఈ వ్యాఖ్యలుగమనించారో లేదో? అనిచురకలు అంటించారు.

**నాకు బీఆర్ఎస్‌తో సంబంధం లేదు:** “నాకు బీఆర్ఎస్ తో సంబంధం లేదు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవీ నాకొద్దు.. నా రాజీనామా యాక్సెప్ట్ చేయమని కోరుతున్నా..”అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఉద్యమ సంస్థ అని,గతంలో అనేక ఉద్యమాలు చేశామని,తెలంగాణ ఉద్యమంలో తమకంటూ ఓ పేజీనే క్రియేట్ చేసుకున్నామని గర్వంగా చెప్పగలనని తెలిపారు. సాధించుకున్న తెలంగాణలోను తమవంతు పాత్ర పోషించామని, తెలంగాణ వచ్చిన తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు పెట్టి ఎంతో మంది యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేశామన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీ గాను తన దృష్టికి వచ్చిన ఎన్నో సమస్యలను పరిష్కరించానని తెలిపారు.

**నా వెనక ఎవరూ లేరు...**

తాను ఇండిపెండెంట్ అని, తన వెనుక ఎవరు లేరని, ముందు మాత్రం ప్రజలు ఉన్నారని ఎమ్మెల్సీ కవితఅన్నారు. కొత్తగావచ్చిన వారిపై ఆరోపణలు, అనుమానాలు, అవమానాలు ఉంటాయినా నడక ద్వారా తన స్టాండ్ ఏంటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. దగాపడ్డ ఉద్యకారుల్లో తానూ బాధితురాలినే అన్నారు.ఆడబిడ్డలు అన్నీ చెప్పరని, గతంలో కన్నా ఇప్పుడే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కొత్తగా వచ్చిన వారిపై ఆరోపణలు, అనుమానాలు, అవమానాలు ఉంటాయి. కాంగ్రెస్ వాళ్లు నేను బీజేపీ బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్ బీ టీమ్ అని అంటారని, బీఆర్ఎస్ వాళ్లు ఏదేదో ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే తన నడక ద్వారా నా స్టాండ్‌ఏంటో ప్రజలకు అర్థమవుతుంది.అందుకు కొంత సమయం పడుతుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు విషయంలో రేవంత్ రెడ్డి నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నీళ్ల విషయంలో మహబూబ్‌నగర్ చారిత్రాక అన్యాయం చేస్తున్నారని, ఆయనను ప్రజలు క్షమించరన్నారు. నియామకాల్లో 8 మంది నాన్ లోకల్స్‌కు గ్రూప్1లో ఉద్యోగాలు ఇచ్చారు. దీనిపై సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కుతాను లేఖ రాశానని, నిధుల విషయంలోనూ అన్యాయమే చేస్తున్నారని పేర్కొన్నారు. రెండున్నర లక్షల కోట్లు అప్పు తెచ్చినా..ఆరు గ్యారంటీలు అమలు చేయటం లేదని, తెచ్చిన డబ్బులు మిస్‌యూజ్ అయ్యాయని, వాటి గురించి ప్రశ్నిస్తామన్నారు. అమరవీరులందరికీ న్యాయం జరగలేదని, అందుకే అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలు ఇప్పించాలని పోరాటం చేస్తున్నాని తెలిపారు.

**నా రాజీనామా ఆమోదించండి..**

నా రాజీనామా యాక్సెప్ట్ చేయండని నేను అడుగుతూనే ఉన్నా.. కాంగ్రెస్ వాళ్లకు ఏం రాజకీయం ఉందో? నా రాజీనామా యాక్సెప్ట్ చేస్తే పార్టీ మారిన ఎమ్మెల్యేల రాజీనామాలు యాక్సెప్ట్ చేయాల్సి ఉంటుందేమో? నేను లోకల్ బాడీ ఎమ్మెల్సీని. ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో కూడా తెలియదని చెప్పారు.